క్లుప్తంగా

ఘనంగా శాంభవీ దేవి పల్లకోత్సవం



అమ్మవారి విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి ఊరేగిస్తున్న భక్తులు

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవీ దేవి పల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో వేకువజాము నుంచి ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళ హారతులు పట్టి, ఫలపుష్పాలంకరణలు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు.అనంతరం గ్రామ పెద్దలు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టనగౌడ, జెడ్పీటీసీ సభ్యురాలు పవిత్ర పాటిల్ సమక్షంలో అమ్మ వారి విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి మేళతాళాలు, డప్పువాయిద్యాలు, కలశాలతో గ్రామంలో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. తిరిగి యథావిధిగా ఆలయానికి చేర్చారు. ఊరేగింపులో భక్తులు అమ్మవారి దర్శనం చేసుకోగా యువకులు నృత్యం చేస్తూ సందడి చేశారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో రజతం

ఆదోని సెంట్రల్: రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడా పోటీల్లో విద్యార్థి జగదీష్ రజత పతకం సాధించినట్లు పెద్దహరివాణం పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శంకరప్ప తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ బాలప్ప అధ్యక్షతన విద్యార్థి జగదీష్‌కు అభినందన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. అక్టోబర్ 19 నుంచి 21వ తేదీ వరకు జరిగిన ఖోఖో పోటీల్లో జగదీష్ రజత పతకం సాధించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాఠశాల నుండి హనుమేష్, నవీన్, సుమలత ఎంపికయ్యారని వారు కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

కరువు మండలంగా ప్రకటించాలి



రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

ఆదోనిరూరల్: ఆదోనిని కరువు మండలంగా ప్రకటించి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న కోరారు. ఈ మేరకు బుధవారం రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కుప్పగల్ క్రాస్, సిరుగుప్ప క్రాస్, సంతెకూడ్లూరు గ్రామాల్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ యేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, కరువు మండలాలుగా ప్రకటించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, వ్యవసాయ కూలీలకు 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి.వీరారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతు సంఘం మండలాధ్యక్షులు కె.శేఖర్, సీఐటీయూ మండలాధ్యక్షులు జె.రామాంజనేయులు, కేవీపీఎస్ మండల కార్యదర్శి బి.తిక్కప్ప, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని కల్లుబావి వీధికి చెందిన ఓ యువతి బుధవారం ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇంట్లోనే పురుగు మందు సేవించిందని, అందుకు కారణాలు తెలియాల్సి ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.

బీజేపీ ద్వంద్వ వైఖరి సరికాదు

మంత్రాలయం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తామని పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ప్రకటించడం శోచనీయమని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్‌బాషా పేర్కొన్నారు. స్థానిక పరిమళ విద్యానికేతన్‌లో యువత, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. చత్తీస్‌ఘడ్‌లోని ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కృషి చేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించారని వారు పేర్కొన్నారు. ఆంధ్రాలో ఉన్న ఉక్కు పరిశ్రమను మాత్రమం ప్రైవేటీకరణ చేస్తామని, అక్కడేమో వ్యతిరేకమని బీజేపీ ప్రకటించడం విచారకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతిపై బీజేపీ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నవంబర్ 8వ తేదీ నాటికి కార్మికులు చేస్తున్న నిరాహార దీక్ష వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా వామపక్షాలు సంఘీభావం తెలుపనున్నాయని పేర్కొన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం వచ్చే 8న విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయక కార్యదర్శి థామస్, తాలూకా అధ్యక్షుడు వీరేష్, కార్యదర్శి ఎం.రాజు పాల్గొన్నారు.

నెరవేరిన పాతికేళ్ల కల

- పెద్దకడబూరులో రూ.35 లక్షలతో షాదీఖానా నిర్మాణం
- నేడు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ముస్లిం మైనార్టీలు



పెద్దకడబూరులో ప్రారంభోత్సవానికి సిద్ధమైన షాదీఖానా

మంత్రాలయం/పెద్దకడబూరు: ముస్లిం మైనార్టీల పాతికేళ్ల కల ఇది. గతంలో శుభకార్యాలు చేసుకోవాలంటే ఎన్నో ఇక్కట్లు పడ్డారు. ఇరుకు సందుల్లో, ఇళ్ల మధ్య శుభకార్యాలు చేసుకోవడం కష్టంగా ఉండేది. ఇన్నేళ్ల వారి కల నేడు సాకారమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాయం, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చొరవతో కలల సౌధం నిర్మితమైంది. గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా షాదీఖానా ప్రారంభం చేయనున్నారు. ముస్లిం మైనార్టీ సోదరులు షాదీఖానా నిర్మాణం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెద్దకడబూరు మండల కేంద్రంలో ముస్లింలు, కటిక, దూదేకుల కులాలు 300 కుటుంబాలు ఉన్నాయి. వెయ్యి మందికి పైగా నివాసం ఉంటున్నారు. మండలంలోని హెచ్.మురవణి, మేకడోణ, కంబలదిన్నె, జాలవాడి, కల్లుకుంట, చిన్నతుంబళం, బసలదొడ్డి, గంగులపాడు గ్రామాల్లోనూ ముస్లిం మైనార్టీలు ఉన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పెద్దకడబూరు మండల కేంద్రంలో షాదీఖానా నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో 10 సెంట్ల స్థలంలో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పునాదులు, బేస్‌మట్టం పూర్తి కూడా చేశారు. అయితే వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాంతరం షాదీఖానా నిర్మాణం నిలిచిపోయింది. తర్వాత పాలకులు, టీడీపీ ప్రభుత్వ హయాంలో షాదీఖానా నిర్మాణాన్ని పట్టించుకోలేదు. దీంతో విసుగెత్తిన ముస్లింలు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని ఆశ్రయించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆయన ప్రత్యేక కృషితో భవన నిర్మాణాన్ని మొదలు పెట్టారు. సీఎండీఎఫ్ నిధులు రూ.35 లక్షలు వెచ్చించి భవనం కట్టడం పూర్తి చేశారు. గురువారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా భవన ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. ఎట్టకేలకు షాదీఖానా కల నెరవేరడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై శుభకార్యాలు చేసుకోవడానికి ఇబ్బందులు గట్టెక్కినట్టేనని అభిప్రాయపడుతున్నారు. భవన నిర్మాణం పూర్తి చేయడంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

మేలు మరువలేం



గతంలో మా కమ్యూనిటీ వాళ్లు పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు చేసుకోవడానికి చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఇరుకు గదులు, వీధుల్లో ఫంక్షన్లు చేయాలంటే ఇరుగుపొరుగు వాళ్లకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మా ఇబ్బందులు గుర్తించి షాదీఖానా నిర్మించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే మేలు ఎప్పటికీ మరువలేం.

– ముల్లా బడేసాబ్, పెద్దకడబూరు

ఎమ్మెల్యే సహకారంతో నిర్మాణం



గత ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు హామీ ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో మండల కేంద్రంలో భవన నిర్మాణం చేపట్టాం. హామీ నిలబెట్టుకోవడంతో స్థానికులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– శ్రీవిద్య, ఎంపీపీ, పెద్దకడబూరు

బెట్ట నివారణకు చర్యలు చేపట్టాలి



పప్పుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ రవి

మద్దికెర: రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ పైర్లు వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండుతున్నాయని, రైతులు పంటను కాపాడుకోవాలని ఏఓ రవి సూచించారు. ఆయన బుధవారం స్థానిక పంట పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బెట్ట తట్టుకోవడానికి 19-19-19 ఎకరానికి ఒక కిలో పిచికారీ చేసుకోవాలన్నారు. అదే విధంగా రబ్బరు పురుగు నివారణకు 2 గ్రాముల అసిపేట్ లీటర్ నీటికి లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటరు నీటికి లేదా ఇండాక్సకార్బ్ 1 గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. వడలు తెగులు నివారణకు సాఫ రెండు గ్రాములు లేదా ఆవాచ్ రెండు గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటిలో కలుపుకొని మొక్కలు తడిసే విధంగా పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ బోజరాజు, వీఏఏ ఆనంద్ ఉన్నారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జనోత్సవం



నిమజ్జనోత్సవానికి తరలివెళ్తున్న సంతపేట దుర్గామాత విగ్రహం



శోభాయాత్రలో చిందులు వేస్తున్న యువత, చిన్నారులు

ఆదోనిఅర్బన్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆయా వీధుల్లో కొలువుదీరిన విగ్రహాల నిమజ్జనోత్సవం బుధవారం కొనసాగింది. ఈ మేరకు సంతపేటలో కొలువుదీరిన దుర్గామాత విగ్రహాన్ని పురవీధులగుండా శోభాయాత్ర నిర్వహించి మండలంలోని చిన్నహరివాణం గణేష్ ఘాట్ ఎల్లెల్సీ కాలువలో నిమజ్జనోత్సవానికి తీసుకెళ్లారు. శోభాయాత్రలో యువత డీజే పెట్టుకొని చిందులు వేశారు. అనంతరం ఎల్లెల్సీ కాలువ వద్ద అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనం చేశారు. పండుగ రెండు రోజులు ఉండడంతో పట్టణంలోని కొలువుదీరిన 28 విగ్రహాలను కొందరు మంగళవారం, మరికొందరు బుధవారం నిమజ్జనం చేశారు.

నేటి సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగానే ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఆరోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని గుర్తించి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే వైద్య శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని, మెరుగైన వైద్యం చేయించుకోవాలని వివరిస్తున్నారు. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో గురువారం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్‌ను అధికారులు వెల్లడించారు.

మండలం	గ్రామం	ప్రదేశం
ఆదోని పట్టణం	శంకర్‌నగర్	అమరావతినగర్ సచివాలయం
ఆదోని పట్టణం	హవ్వన్నపేట	కృష్ణ టెంపుల్
ఆదోని	జాలిబెంచి	గ్రామ సచివాలయం
కోసిగి	వందగల్లు	ప్రాథమిక పాఠశాల
కౌతాళం	చూడి	గ్రామ సచివాలయం
మంత్రాలయం	మాధవరం	యం.తాండ సచివాలయం
పెద్దకడబూరు	నౌలేకల్లు	ప్రాథమిక పాఠశాల

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి



కోసిగిలో ఏడీఏ శాంతిస్వరూప్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కోసిగి: మండల పరిధిలోని పెండేకల్లు గ్రామంలో వ్యవసాయానికి 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల నాయకులు రాముడు, వీరేష్ కోరారు. బుధవారం కోసిగి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆ గ్రామ రైతులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీఏ శాంతి స్వరూప్, ఏఈ వీరేష్‌లను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక వైపు వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువు కింద పంటలు సాగు చేసిన వారు పొలానికి నీటి తడులు పెట్టుకునేందుకు పగటి వేళ 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఏడీఏ మాట్లాడుతూ.. విద్యుత్ సప్‌లై తక్కువగా ఉండడం వల్ల పూర్తి స్థాయిలో న్యాయం చేయలేక పోతున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తామన్నారు.

రైతులను ఆదుకోవాలి



రాస్తారోకో చేస్తున్న రైతు సంఘం నాయకులు

కోసిగి: వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునే దిశగా కోసిగిను కరువు మండలంగా ప్రకటించి పరిహారం అందించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు కోరారు. బుధవారం కోసిగిలో రైతు సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు వేరుశనగ, పత్తి, మిరప, ఉల్లి, ఆముదం పంటలు సాగుచేసుకున్నారన్నారు. సరైన వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోయి తీవ్ర నష్టం మిగిలిందన్నారు. నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పరిహారం అందించాలని కోరారు. కేవీపీఎస్ మండల కార్యదర్శి హనుమంతు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నాగేంద్ర, ముత్రన్న, కలింగ, ఈరన్న, తాయప్ప, మహానంది, కోసిగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటిని కూల్చేస్తున్నారని ఫిర్యాదు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన మద్దిలేటమ్మ ఇంటిని గ్రామానికి చెందిన మహానంది అతని కుమారులు నెట్టి కంతయ్య, శ్రీరాములు కూల్చేస్తున్నారని బుధవారం బాధితురాలి కూతురు కృష్ణవేణి పత్తికొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వృద్ధురాలైన తల్లి మద్దిలేటమ్మ యోగక్షేమాలు చూస్తూ కృష్ణవేణి అదే ఇంట్లోనే ఉంటోంది. ఇంటి పక్కన కొత్తగా ఇంటి నిర్మాణం చేస్తూ దౌర్జన్యంగా గోడను గడ్డపారలతో పెకిలించారు. ప్రశ్నించిన తనపై దాడి చేశారని కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి పంపి కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాల్ తెలిపారు.

జాతి వైరం మరచి..

మంత్రాలయం: తల్లి అనురాగానికి జాతి వైరం లేదనడానికి ఈ చిత్రం ఓ ఉదాహరణ. మంత్రాలయం మండలం రచ్చమర్రి గ్రామంలో ఓ వరాహం పడుకుని సేద తీరుతుండగా కుక్కపిల్లల సమూహం అక్కడికి చేరాయి. కుక్కపిల్లలంతా కలిసి పడుకున్న వరాహం చనుబాలు సేవించాయి. కుక్కపిల్లలు ఎంతగా అల్లరి చేసినా వరాహం మాత్రం కదలలేదు. జాతి వైరం మరచి వరాహం కుక్కపిల్లలకు పాలిస్తున్న చూపరులను ఆశ్చర్యానికి గురిచేసింది.



వరాహం పాలు తాగుతున్న కుక్కపిల్లలు

సురక్ష శిబిరాలకు విశేష స్పందన



సంతెకూడ్లూరులో జరిగిన వైద్యశిబిరంలో మాట్లాడుతున్న అధికారులు,



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌లను అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఆదోనిరూరల్: ప్రభుత్వం ప్రజల కోసం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దానమ్మ సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో సర్పంచ్ ఎం.ధనలక్ష్మి, ఎంపీటీసీ కమలమ్మ ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు నిసీగ్రేస్, గీత, శేఖర్, మోబినాఅర్షి పాల్గొని 600 మందికి పైగా రోగులను పరీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎంపీపీ పరిశీలించారు. ప్రజలు పౌష్టికాహారమైన ఆకుకూరలు, పప్పుదినుసులు తదితర వాటిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.మల్లికార్జున, ఎంపీహెచ్ఈఓ లక్ష్మీనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



లింగాలదిన్నెలో వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లింగాలదిన్నె సర్పంచ్ వీరభద్ర గౌడ, అగసలదిన్నె సర్పంచ్ పామన్న అన్నారు. బుధవారం లింగాలదిన్నె గ్రామంలో ఎంపీడీఓ సుబ్బరాజు అధ్యక్షతన సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రతి ఇంటినీ సర్వే చేయించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా చికిత్సతో పాటు మందులను అందిస్తున్నట్లు చెప్పారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ ద్వారా కర్నూలుకు రెఫర్ చేయించి చికిత్స చేయిస్తున్నట్లు వివరించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది వలంటీర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


ఘనంగా కలశ ప్రతిష్ట



మఠం నుంచి కలశాన్ని తీసుకొస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో హజరత్ సయ్యత్ ఫక్రుద్దీన్, మాబు సుభాని దర్గాలను నూతనంగా నిర్మిస్తున్న నేపథ్యంలో గ్రామంలో కొలువైన తొంటరాధ్య మఠంలో కలశాన్ని ఉంచి మూడు రోజులపాటు పూజలు నిర్వహించారు. మఠం పీఠాధిపతి సిద్ధలింగ మహాస్వామి, ఉత్తారాధికారి బసవలింగ మహాస్వాముల చేతుల మీదుగా మఠం నుంచి భక్తులు కలశాన్ని ఊరేగింపుగా దర్గా వరకు తరలించి దర్గాలో ఫాతేహాలు, పూజల అనంతరం కలశాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం దర్గాను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ఇలాంటి కార్యక్రమాలు గ్రామంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న ఎస్‌ఐ కిరణ్‌బాబు

మంత్రాలయం: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని బుధవారం మాధవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కిరణ్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. కోసిగి మండలం దొడ్డిబెళగల్ గ్రామానికి చెందిన మంజునాథ్‌గౌడ్ యూనికార్న్ బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తుండగా మాధవరం తండా రోడ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 384 ఒరిజినల్ చాయిస్ మద్యం టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్), బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వేధింపుల కేసు నమోదు

గోనెగండ్ల: మండల కేంద్రంలోని అచ్చుకట్ల వీధికి చెందిన బీబీ ఫాతిమా అనే వివాహితను భర్త, అత్త, మామ, మరిది అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురిచేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్లలోని అచ్చుకట్ల వీధికి చెందిన బీబీ ఫాతిమాకు, అదే గ్రామానికి చెందిన షేక్ సలీం బాషకు ఆరేళ్ల క్రితం వివాహం అయ్యింది. అయితే గత రెండు సంవత్సరాలుగా భర్త సలీం బాష, అత్త మెహరిన్ బీ, మామ రసూల్‌సాబ్, మరిది షఫీ రూ.2 లక్షలు వరకట్నం తేవాలని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. ఫాతిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకుపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేవరగట్టు బన్ని ఉత్సవంలో విషాదం



మృతుడు మాల గణేష్ (ఫైల్)

ఆస్పరి: దేవరగట్టులో బన్ని ఉత్సవాలను చూసేందుకు వెళ్లిన యువకుడు శవమై ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనతో ఆస్పరిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆస్పరికి చెందిన మాల వృశేని, సుజాతమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తె ఉన్నారు. కుమారుడు మాల గణేష్ (18) బేతంచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులు రావడంతో గణేష్ స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం తోటి స్నేహితులతో కలసి దేవరగట్టులో జరిగే ఉత్సవాలను చూసేందుకు వెళ్లారు. అక్కడ చెట్టు కింద నిలబడిఉండగా ఒక్కసారిగా కొమ్మలు విరిగి గణేష్‌పై పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. దైవకార్యాన్ని చూసేందుకు వెళ్లి ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. ఆలూరులో పోస్టుమార్టం తరువాత బుధవారం స్వగ్రామమైన ఆస్పరికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

ఆస్పరి/ఆలూరు రూరల్: దేవరగట్టులో చెట్టు విరిగి పడిన ఘటనలో మృతి చెందిన గణేష్ (18), రామాంజినేయులు (49) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. బుధవారం ఆస్పరిలో గణేష్, మొలగవల్లి కొట్టాలలో రామాంజినేయులు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవరెడ్డి, రంగన్న, గపూర్, వీరేష్, చిన్న ఈరన్న, శ్రీరాములు తదితరులు నివాళులర్పించారు.

సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్‌లో సరైన వర్షాలు లేక పంటలు ఎండిపోవడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక కూలీలు పొట్టకూటి కోసం వలస వెళుతున్నారని, వారి పిల్లల కోసం సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు, మంత్రాలయం, దేవనకొండ, ఆస్పరి, ఆలూరు, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, సి.బెళగల్ మండలాల నుంచి వలసలు పెరిగిపోయాయన్నారు. తల్లి దండ్రులు వలస వెళుతుండడంతో వారి పిల్లలు విద్య కు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అలాంటి విద్యార్థుల కోసం జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రారంభిస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్, అధికారులు

ఆదోనిఅర్బన్ : పట్టణంలో జయంత్ కాటన్ ట్రేడర్స్ జిన్నింగ్ మిల్లులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మద్దతు ధర పత్తి కొనుగోలు కేంద్రాలు బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్ అహ్మద్, అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్, సీసీఐ కాటన్ బయ్యర్ సిద్ధలింగ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గుంటూరు నుంచి వ్యవసాయ శాఖ మంత్రి కాసాని గోవర్ధన్‌రెడ్డి పత్తి కొనుగోళ్లను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారని చెప్పారు. జిల్లాలో ఏడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని, అందులో ఆలూరు రోడ్డులోని జయంత్ కాటన్ ట్రేడర్స్, శిరుగుప్ప రోడ్డులోని ఎన్‌డీబీఎల్ పరిశ్రమలో ప్రారంభమయ్యాయన్నారు. అదేవిధంగా ఎమ్మిగనూరులో మాధవ్, శివ, మురారి, రాఘవేంద్ర, జిన్నింగ్ ఫ్యాక్టరీలలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కనీస మద్దతు ధర పొడవు పింజ రకం క్వింటా రూ.7,020, ఒట్టి పింజ రకం క్వింటా రూ.6,620 ఉంటుందన్నారు. ప్రస్తుతం ఆదోని మార్కెట్‌యార్డులో గరిష్ట ధర రూ.7,580, కనిష్ట ధర రూ.4,898, మధ్య ధర రూ.7,300 పలుకుతోంది. రానురాను ధరలు మరింత తగ్గే ప్రమాదం ఉండడంతో రైతులు నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలుస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో యార్డు సూపర్‌వైజర్లు మోహన్‌రెడ్డి, నరేష్‌కుమార్, ఆనంద్‌కుమార్, నాగరాజు, రైతు సంఘం నాయకుడు ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.